# సాక్షి
## ఆదిలాబాద్

మంగళవారం | 21 | జనవరి | 2025






**డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం..**
నార్నూర్ మండలంలో ఐచర్ బోల్తాపడిన ఘటనలో విచారణ కొనసాగుతుందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా పోలీసులు నిర్ధారిస్తున్నారు. 8లో▸



**సాగునీరు అందట్లే..!**
తాంసి చెరువుకు 20 ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. దీంతో పంటలకు సాగునీరందని పరిస్థితి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.0/12.0

**వాతావరణం**
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### విద్యాశాఖ ఏడీగా వేణుగోపాల్‌గౌడ్



ఏడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈవో, ఉద్యోగులు

కైలాస్‌నగర్: జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కే.వేణుగోపాల్ గౌడ్ నియామకమయ్యారు. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఏడీగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం జిల్లాకు బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారులు జే.నారాయణ, సుజాత్ అలీ, ఉదయశ్రీ,, సూపరింటెండెంట్లు రమణ, మధుసూదన్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న భోజన్నకు ఏడీగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఆయనను వికారాబాద్ జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో పరీక్షల విభాగంలో పనిచేస్తున్న మమతను సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

### రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ సభ్యుడిగా రామన్న

కైలాస్‌నగర్: రైతు ఆత్మహత్యలపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీలో మాజీ మంత్రి జోగు రామన్నకు చోటు కల్పించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తొమ్మిది మందితో నియమించిన కమిటీలో రామన్న సభ్యుడిగా ఉండనున్నారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా వారం పాటు పర్యటించి పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు, దుర్భర వ్యవసాయరంగ పరిస్థితులపై అధ్యయనం చేసి మాజీ సీఎం కేసీఆర్‌కు నివేదిక అందించనుంది.

### రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ఆదిలాబాద్: ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఏఎంవీఐ ఫహిమా సుల్తానా అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్లో ఆటోడ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై సోమవారం అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్యూష, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు మంగళవారం జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్ క్రికెట్, చెస్, క్యారం, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఖోఖో, యోగా తదితర క్రీడాంశాల్లో మహిళలు, పురుషులకు వేరువేరుగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు వారి సర్వీస్ సర్టిఫికెట్, గుర్తింపు కార్డుతో ఉదయం 10 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

### ఘనంగా 'సంక్రాంతి పసుపు బొట్టు'



పసుపు కుంకుమలు ఇచ్చిపుచ్చుకుంటూ..

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సంక్రాంతి పసుపు బొట్టు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మహిళలు కుంకుమ పసుపు బొట్లను ఇచ్చిపుచ్చుకున్నారు.

# కొలిక్కి వచ్చినట్టేనా..

- భీంపూర్ మండలం నిపాని గ్రామ శివారులో ఓ మహిళకు గతంలో ఎనిమిదెకరాల వ్యవసాయ భూమి ఉండేది. ఇందులో సుమారు 40శాతం భూమిని ఆమె కొన్నేళ్ల క్రితం వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లుగా విక్రయించారు. ఇందులో ఇళ్ల నిర్మాణం కూడా పూర్తయింది. మరో 60 శాతం భూమి మాత్రమే సాగవుతుంది. అయితే సదరు మహిళ మాత్రం గత ప్రభుత్వ హయాంలో ఎనిమిదెకరాల విస్తీర్ణానికి రైతుబంధు అందుకోవడం గమనార్హం. విషయాన్ని ఇటీవల నిర్వహించిన సర్వేలో అధికారులు గుర్తించారు. అయితే ప్రభుత్వ తాజా నిబంధనల ప్రకారం సాగవుతున్న భూమికే మాత్రమే రైతు భరోసా అందనుంది.
- బోథ్ మండలంలో కొత్త రేషన్‌కార్డు జాబితాలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి పేరు వచ్చింది. గతంలో ఆయన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా, తాజాగా జాబితాలో ఆ పేరు రావడం గమనార్హం. దీనిపై గ్రామంలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామసభలో ఆ పేరు తొలిగిపోతుందని అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది.



నర్సాపూర్‌లో ఫీల్డ్ సర్వేలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఇచ్చోడ: సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి గ్రామాల్లో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని

**సర్వే పకడ్బందీగా చేపట్టాలి**

కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని నర్సాపూర్, మల్యాల్ గ్రామాల్లో చేపట్టిన సర్వేను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లో పంటకు ఆమోదయోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. ఆయన వెంట జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్, ఎంపీవో సత్యానంద్ తదితరులున్నారు.

- నాలుగు సంక్షేమ పథకాల అమలుపై యంత్రాంగం ఫోకస్
- పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక సర్వే
- నేటి నుంచి గ్రామసభలు
- ఫిర్యాదులు సైతం స్వీకరణ

సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వే సోమవారంతో ముగిసింది. మంగళవారం(నేటి) నుంచి శుక్రవారం వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనున్నాయి. ఈ సభల్లో నోటీసు బోర్డుపై అర్హులైన వారి పేర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అంతే కాకుండా వాటిని చదివి వినిపిస్తారు. వీటిపై అభ్యంతరాలు వ్యక్తమైనా, ఎవరైనా ఫిర్యాదులు అందజేసినా స్వీకరిస్తారు. గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని ఇప్పటికే కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ సభలపై అందరి దృష్టి నెలకొంది.

**చిక్కుముడులు వీడినట్టేనా..**

ఈ నాలుగు సంక్షేమ పథకాల అమలు పరంగా ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో అర్హుల జాబితాను ఎంపిక చేశారు. ఇక వాటిని గ్రామసభలో ప్రవేశపెట్టిన తర్వాత యథావిధిగా ఆమోదం పొందుతాయా.. లేనిపక్షంలో అభ్యంతరాలు వ్యక్తమై ఆ జాబితా నుంచి పలు దరఖాస్తులపై అనర్హత వేటు పడుతుందా అనేది చూడాల్సిందే. ప్రధానంగా సాగు యోగ్యం లేని భూమి నిర్ధారణకు సంబంధించి సర్వేలో అధికారుల దృష్టికి అనేక అంశాలు వచ్చాయి. వీటిలో కొంత భూమి ఇతర అవసరాలకు వినియోగించగా, మిగిలిన భూమి సాగు చేస్తుండడంతో ఈ భూమికి సంబంధించి రైతు భరోసా ఇచ్చేందుకు ఎలా ముందుకెళ్లాలనే విషయంలో కొంత తికమక ఎదురైనట్లు తెలుస్తోంది. అయితే కలెక్టర్ సోమవారం రాత్రి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో దీనిపై స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే మిగతా వాటి విషయంలోనూ క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది. ఇకపోతే మంగళవారం నుంచి గ్రామసభల నిర్వహణ ఎలా సాగుతుందనేది ఆసక్తికరం.

**జిల్లాలో నిర్వహించిన సర్వేలో ఇప్పటివరకు తేలిన అంశాలు..**

**రైతు భరోసా వివరాలు..**
రైతుబంధు అందిన విస్తీర్ణం : 5,15,271 ఎకరాలు
సాగు యోగ్యం లేని భూమి : 3,027 ఎకరాలు

**ఇందిరమ్మ ఇళ్ల వివరాలు..**
వచ్చిన దరఖాస్తులు : 1,97,448
పరిశీలన: అన్ని దరఖాస్తులకు సంబంధించి పూర్తి
సొంత స్థలం ఉన్నవారు : 91,594
ఇల్లు లేదు, జాగలేదు :28,927 (మరికొన్ని మండలాల వివరాలు రావాల్సి ఉంది)

**రేషన్ కార్డులు..**
వచ్చిన దరఖాస్తులు: 18,741
పరిశీలన పూర్తయింది : 18,212 (పూర్తి సమాచారం రావాల్సి ఉంది)
ఇందులో అర్హులు : 17,269

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..**
జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు :1,71,505
అధికారుల అంచనా ప్రకారం అర్హులయ్యే కుటుంబాలు:లక్షకు పైగా..

# 'రేషన్'లో మార్పులకు అవకాశం

- ఏళ్ల నిరీక్షణకు తెర
- తీరనున్న కార్డుదారుల తిప్పలు

| మండలం | అందిన దరఖాస్తులు |
|---|---|
| ఆదిలాబాద్ అర్బన్ | 5,818 |
| ఆదిలాబాద్‌రూరల్ | 2,512 |
| నార్నూర్ | 1,306 |
| గాదిగూడ | 1,589 |
| మావల | 2,062 |
| గుడిహత్నూర్ | 1,810 |
| తలమడుగు | 1,518 |
| తాంసి | 751 |
| బేల | 1,988 |
| నేరడిగొండ | 781 |
| బజార్‌హత్నూర్ | 1,307 |
| బోథ్ | 2,802 |
| ఇచ్చోడ | 2,023 |
| సిరికొండ | 532 |
| ఇంద్రవెల్లి | 2,184 |
| ఉట్నూర్ | 2,105 |
| భీంపూర్ | 1,089 |
| జైనథ్ | 2,274 |

కైలాస్‌నగర్: ఆహారభద్రత కార్డుల్లో సభ్యుల మార్పులు, చేర్పుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడనుంది. అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు సభ్యుల పేర్లను కూడా చేర్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 34,451మంది వివరాలతో కూడిన జాబితాను జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి పంపించింది. ఆయా పంచాయతీలు, వార్డుల వారీగా సిద్ధం చేసిన అధికారులు ఆ జాబితాలను పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లకు అందజేశారు. వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అర్హులైన వారి సమాచారం సేకరిస్తున్నారు. లబ్ధిదారులను గుర్తించి మంగళవారం నుంచి నిర్వహించే గ్రామసభల్లో వారి వివరాలు వెల్లడించనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆయా కార్డుల్లో కుటుంబంలోని కొత్త సభ్యుల పేర్లు నమోదు కానున్నాయి. తద్వారా రేషన్ సరుకులు పొందే అవకాశం కలగనుంది.



జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న వార్డుఆఫీసర్లు

**ఏళ్లుగా ఎదురుచూపులు..**

పెళ్లి అయి కొత్తగా అత్తవారింటికి వచ్చిన మహిళలు, పుట్టిన పిల్లల పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చేందు కోసం ఇప్పటికే చాలా మంది మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చివరగా 2021లో రేషన్‌కార్డులను జారీ చేసింది. అయితే కొత్తగా కుటుంబంలోని సభ్యుల పేర్ల చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించలేదు. దీంతో చాలా మంది ఏళ్లుగా నిరీక్షించారు. పుట్టిన పిల్లలు బడికి వెళ్లే వయస్సు వచ్చినా వారి పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు కాలేదు. దీంతో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌తో పాటు మండలస్థాయిలో అధికారులను కలుస్తూ చాలామంది అర్జీలు అందించారు. ఏళ్లుగా ఎదురుచూశారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం వారి నిరీక్షణకు తెర దించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరి పేర్లను కార్డుల్లో చేర్చేలా ఆదేశాలిస్తూ వారి వివరాలను జిల్లాకు పంపించింది. వాటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికితిరుగుతూ సమాచారం సేకరిస్తున్నారు. నేటినుంచి 24 వరకు జరిగే గ్రామసభల్లో అర్హుల వివరాలు వెల్లడించి కార్డుల్లో మార్పులు, చేర్పులు చేయనున్నారు.

**గ్రామసభల్లో అర్హుల ఎంపిక..**

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా అవకాశం కల్పించింది. ప్రభుత్వం నుంచి అందిన జాబితా ప్రకారం క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలన చేస్తున్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి గ్రామసభల్లో ఆ వివరాలను ప్రదర్శిస్తారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారుంటే గ్రామసభల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మార్పులు, చేర్పులకు సంబంధించిన అప్లికేషన్లు కూడా స్వీకరిస్తారు. –వాజిద్ అలీ, డీఎస్‌వో

## నేటి నుంచి వార్డు సభలు

కైలాస్‌నగర్: నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం నేటి నుంచి ఆదిలాబాద్‌లో వార్డుసభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు ప్రకటనలో తెలిపారు. రవీంద్రనగర్ కాలనీలో మంగళవారం ఉదయం 9గంటలకు నిర్వహించనున్న వార్డు సభకు కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గొడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే 21న 13 వార్డులు, 22న 17వార్డులు, 23న 19 వార్డుల్లో లబ్ధిదారుల ఎంపిక సభలు ఉంటాయని తెలిపారు. ఆయా కాలనీల్లో నిర్వహించనున్న సభలకు అర్హులైనవారు హాజరై ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని సూచించారు.

# 'మెస్రం' పాదయాత్రకు విరామం



దొడందా పొలిమేరలో చెట్టుపై గంగాజలాన్ని భద్రపరిచిన మెస్రం వంశీయులు

- ఆచారం ప్రకారం గ్రామాలకు వెళ్లిన వంశీయులు

ఇంద్రవెల్లి: ఈ నెల 28న నాగోబా ఆలయంలో చేపట్టనున్న మహాపూజకు అవసరమయ్యే గంగాజలంను పాదయాత్ర ద్వారా సేకరించిన మెస్రం వంశీయులు ఆదివారం రాత్రి మండలంలోని దొడందాకు చేరుకున్న విషయం విదితమే. గ్రామ పొలిమేరలో ఉన్న చెట్టుపై గంగాజలాన్ని భద్రపరిచారు. అనంతరం పాదయాత్రకు విరామం ఇచ్చి సోమవారం ఉదయం తమ తమ గ్రామాలకు వెళ్లిపోయారు. ఈ నెల 24న మళ్లీ ఇక్కడికి చేరుకుంటారు. భద్రపరిచిన గంగాజలంతో తిరిగి పాదయాత్రగా ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి కేస్లాపూర్ సమీపంలో గల మర్రిచెట్టు వద్దకు చేరుకుని బస చేస్తారు. అక్కడే మూడు రోజుల పాటు తూమ్ పూజలు నిర్వహించనున్నట్లు మెస్రం వంశపెద్దలు తెలిపారు. 28న నాగోబా ఆలయానికి చేరుకుని పవిత్ర గంగాజలంతో నాగోబాను శుద్ధి చేసి జాతర ప్రారంభించనున్నట్లు ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ పేర్కొన్నారు.

- గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఈనెల 21 నుంచి నిర్వహించనున్న గ్రామ సభలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలుఅందేలా చూడాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఈ మేరకు సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన గ్రామసభల నిర్వహణపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈమేరకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులంతా సమన్వయంతో వ్యవహరిస్తూ ముందుకు సాగాలన్నారు.అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ సభల్లో ఫ్లెక్సీలు, మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని, అన్ని పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులపై అర్హుల జాబితాను ప్రచురించాలన్నారు. ఈ సభల్లో వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, అలాగే అర్జీ లు స్వీకరించాలన్నారు. రోజువారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, గ్రామ సభల తీర్మాన ప్రతులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు**

కైలాస్‌నగర్: ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాలిస్న ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదికను ప్రత్యేకంగా అలంకరించాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీరు, షామియానా వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

**బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం**

బేల: బాధిత రైతుకుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని రేణిగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తదితరులున్నారు.

**ఆర్థిక సాయం అందజేత**

బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయంను రెవెన్యూ బృందం తరపున తహసీల్దార్ రఘునాథ్ రావు అందజేశారు.

# 'ఆరోగ్య పాఠశాల'పై జిల్లా స్థాయి పరీక్ష

కైలాస్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ రాజర్షి షా చొరవతో చేపట్టిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమ అమలుపై సోమవారం జిల్లాస్థాయి పరీక్ష నిర్వహించారు. మండలస్థాయిలో టాప్-3లో నిలిచిన స్టూడెంట్ చాంపియన్లకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 18 మండలాల నుంచి ముగ్గురేసి చొప్పున 54 మంది హాజరయ్యారు. పరీక్షను కలెక్టర్ రాజర్షి షా స్వయంగా పరిశీలించారు. డీఈవో, విద్యార్థులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. జిల్లా స్థాయిలో మొదటి ముగ్గురిని ఎంపిక చేసి రిపబ్లిక్ డే వేడుకల్లో వారికి సర్టిఫికెట్, నగదు పురస్కారం అందించనున్నట్లు పే ర్కొన్నారు. ఇందులో డీఈవో ప్రణీత, ఆరోగ్య పాఠశాల జిల్లా కన్వీనర్ డి.అజయ్‌కుమార్ ఆరోగ్య పాఠశాల రిసోర్స్‌పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షకు హాజరైన మండల స్టూడెంట్ చాంపియన్లు

# వినియోగదారులకు అండగా సీజీఆర్‌ఎఫ్

గుడిహత్నూర్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థమే సీజీఆర్‌ఎఫ్ పని చేస్తోందని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల ఫిర్యాదులు, పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు ఎలాంటి సమస్యలున్నా క్షేత్రస్థాయిలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. పరిష్కారం కాని పక్షంలో తమ దృష్టికి తీసుకువస్తే నిర్ణీత కాల పరిమితిలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం పలువురు అందించిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని ఏఈ గౌతంను ఆదేశించారు. ఇందులో సీజీఆర్‌ఎఫ్ టెక్నికల్ మెంబర్ రామకృష్ణ, సంస్థ ఫైనాన్స్ మెంబర్ కిషన్, రాజాగౌడ్, అధికారులు తదితరులున్నారు.

# 'స్పౌజ్'కు ఊరట

- సొంత జిల్లాకు 38 మంది ఉపాధ్యాయుల బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కైలాస్‌నగర్: జీవో '317' బాధిత ఉపాధ్యాయులకు ఎట్టకేలకు ఊరట కలిగింది. నాలుగేళ్లుగా కుటుంబాలకు దూరంగా ఉంటూ ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం సాంత్వన చేకూర్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్పౌజ్ కేటగిరి కింద ఉపాధ్యాయులను తమ సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ సోమవారం జీవో ఎంఎస్ నంబర్ 46 పేరిట ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలో పనిచేస్తున్న 38 మంది ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ కానున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై సదరు ఉపాధ్యాయుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

**38 మందికి ఊరట**

317 జీవో ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించింది. గత నెల 1 నుంచి 30వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. వీరిలో 38 మందిని తమ సొంత జిల్లాలకు బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 32 మంది ఎస్జీటీలు, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లాకు 30మంది బదిలీపై వస్తున్నారు. నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు ఏడుగురు, మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు ఒకరు చొప్పున బదిలీపై రానున్నారు.

**తొలగనున్న అవస్థలు...**

2021 డిసెంబర్‌లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన 317 జీవో ద్వారా ఇతర జిల్లాలకు బదిలీ అయినా స్పౌజ్ ఉపాధ్యాయులు నాలుగేళ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భార్య ఓ చోట, భర్త మరోచోట విధులు నిర్వహించడంతో కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన దుస్థితి. దీంతో మానసికంగా వారు ఆందోళన చెందుతున్నారు. తమను బదిలీ చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినా గత ప్రభుత్వం వారి విజ్ఞప్తులను పట్టించుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలపై అధ్యయనం చేసింది. వారిని సొంత జిల్లాలకు పంపించేలా సిఫార్సు చేసింది. దాని ఆధారంగా ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టింది. దీంతో ఇక నుంచి వారంతా సొంత జిల్లాలో విధులు నిర్వహించనున్నారు.



PROCEEDINGS OF THE DIRECTOR OF SCHOOL EDUCATION:
TELANGANA:: HYDERABAD

ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రతి

## క్లుప్తంగా

### హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



స్వీట్లు తినిపిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: కరీంనగర్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీవరకు 46వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాజట్టు ప్రతిభ కనబ ర్చి తృతీయస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించింది. సోమవారం మంచిర్యాలకు వ చ్చిన జట్టు సభ్యులకు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతంపలికి స్వీట్లు తినిపించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, పీడీ రేని రాజయ్య,కోచ్ సునార్కర్ అరవింద్ పాల్గొన్నారు.

### దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణపై దాడి చేసిన కేసులో సోమవారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..గతనెల 29వ రాత్రి బెల్లంపల్లి బజారుఏరియా ప్రాంతం యూనియన్ బ్యాంక్ వీధిలో ఓ సెలూన్ షాప్‌నకు ఆదినారాయణ వెళ్లగా కొందరు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదైంది. ఈమేరకు నిందితుల్లో ఇద్దరైన రాగంశెట్టి సతీశ్, పూసాల శ్రీకాంత్‌లను అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు పంపించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### నీలుగాయి అప్పగింత



అటవీ అధికారులకు అప్పగిస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ మాజీ సర్పంచ్ ప్రవీణ్ సోమవారం నీలుగాయిని అటవీ అధికారులకు అప్పగించారు. గ్రామ శివారులోని పంట పొలంలో నీలుగాయి కనిపించడంతో మాజీ సర్పంచ్.. అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని నీలుగాయిని నిర్మల్ అటవీశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ ఎఫ్ఆర్‌ఓ అనిత, డిప్యూటీ రేంజ్ అధికారి ఇర్ఫానొద్దీన్, ఎఫ్ఎస్ఓ హర్షద్‌రాజా, బీట్ ఆఫీసర్ అలీం తదితరులు ఉన్నారు.

### 'వసంత పంచమి'కి రావాలని ఆహ్వానం

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో వచ్చేనెల 1 నుంచి 3వ తేదీ వరకు వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రావాలని ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు సోమవారం ఆలయ అధికారులు ఆహ్వానపత్రికను అందించారు. ఆలయ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



# మిట్టపల్లి..ఉద్యోగాల కల్పవల్లి

- ఒకే ఊరిలో 50 మందికిపైగా ప్రభుత్వ కొలువులు
- పోలీసులు, సింగరేణి, కార్యదర్శులు ఇలా అనేకం
- వీరంతా సింగరేణి కార్మికుల పిల్లలు
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



అప్పటి ఉపాధ్యాయులు వెంకటస్వామి, రాంచందర్



లిటిల్ స్టార్ కాన్వెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

జైపూర్: మండలంలోని మిట్టపల్లి మారుమూల గ్రామం. ఇక్కడి ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఇక్కడ సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్ బాగుపడుతుందని పెద్దలు తలచారు. స్థానిక యువత మొక్కవోని దీక్షతో ఉజ్వల భవిష్యత్‌పై ఆశతో ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు సాగించారు. ఊరిలో దాదాపు 50 మందికి పైగా వివిధ ప్రభుత్వ కొలువులు సాధించారు. వీరంతా సింగరేణి కార్మికుల పిల్లలు కావడం విశేషం. పోలీసులు, సింగరేణి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ కానిస్టేబుల్, ట్రాన్స్‌కో ఏఈ, లైన్‌మెన్‌గా ఇలా అనేక ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు చిరునామాగా ఈ గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.

**అక్షరాలు నేర్పింది ఆ పాఠశాలనే..**

మిట్టపల్లిలో 1994లో ప్రారంభమైన లిటిల్ స్టార్ కాన్వెంట్(శ్రీనివాస) హైస్కూల్ ఎంతో మంది విద్యార్థులకు అక్షరాలు నేర్పింది. టేకుమట్ల గ్రామానికి చెందిన అన్నతమ్ముళ్లు సంబోదుల వెంకటస్వామి, రాంచందర్ ఉపాధ్యాయులు వారికి 7వ తరగతి వరకు విద్య బోధించారు. వారంతా ప్రస్తుతం ప్రభుత్వ కొలువులు కొట్టారు. నేడు ఉన్నతస్థానానికి చేరుకున్నారు. కాగా, కాలక్రమేణా 2002లో ఆ పాఠశాల మూతబడింది.

**సైకిళ్లపై 5 కి.మీ. వచ్చి..**

గ్రామంలో ఉన్నత విద్యకోసం విద్యార్థులు మండల కేంద్రానికి వచ్చేవారు. సైకిళ్లపై 5 కి.మీ దూరం వచ్చి వెళ్తుండేవారు. గురుకులం, జెడ్పీ, ప్రైవేట్ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుకున్నారు. పోటీ పరీక్షల్లో సత్తాచాటి ప్రభుత్వ కొలువులు సాధించారు.

**పోలీస్ బ్రదర్స్**





రాజ్‌కుమార్, ఎస్సై    రవికుమార్, ఎస్సై

గోదారి అమృత–లచ్చయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. ఇద్దరు కూతుళ్లు. లచ్చయ్య సింగరేణి ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ 2014లో ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అన్నను ఆదర్శంగా తీసుకున్న తమ్ముడు రవికుమార్ పట్టుదలతో చదివి 2020లో ఎస్సై ఉద్యోగం సాధించాడు. రాజ్‌కుమార్ హన్మకొండలో విధులు నిర్వర్తిస్తుండగా, రవికుమార్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పని చేస్తున్నాడు. ఈ బ్రదర్స్ ఒకే స్కూల్‌లో చదివి పట్టుదలతో పోలీసుశాఖలో ఉద్యోగాలు సాధించారు.

### అన్నాచెల్లెళ్ల ఇద్దరికీ కొలువులే

ఒకే పాఠశాలలో చదివిన తాము అన్నాచెల్లెళ్లు. అన్నగా తాను సింగరేణిలో క్లర్క్ ఉద్యోగం సాధించాను. నా చెల్లి పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైంది. నేను ఎస్టీపీపీలో విధులు నిర్వర్తిస్తుండగా చెల్లెలు చెన్నూర్ మండలంలో కార్యదర్శిగా పనిచేస్తోంది.



దూట రాజమల్లు, సింగరేణి క్లర్క్



శ్రీలక్ష్మి, గ్రామ కార్యదర్శి

### డిప్యూటీ కలెక్టర్ కావడమే లక్ష్యం

వరుసగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్‌బీఐలో పనిచేస్తూనే సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఉన్నతస్థానంలో ఉండాలని మళ్లీ చదివి అటవీశాఖలో (ఎఫ్ఆర్‌వో) ఉద్యోగం సాధించాను. భూపాలపల్లి జిల్లా ములుగులో విధులు నిర్వర్తిస్తున్నాను. డిప్యూటీ కలెక్టర్ కావడమే లక్ష్యంగా ఇటీవల గ్రూప్–1 పరీక్ష రాశాను. – శ్రీరామ్‌కుమార్, రేంజ్ అధికారి



### పట్టుదలతో చదివాను

తాను పోలీస్ ఉద్యోగం సాధించాలని కలలుగన్నా. కష్టపడి చదివి 2019లో ఎస్సై ఉద్యోగం సాధించాను. ఇప్పుడు నిజామాబాద్ జిల్లా దర్పపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్నాను. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. – రామకృష్ణ, ఎస్సై



### 78 కిలోల గంజాయి దహనం



ఎలక్ట్రిక్ యంత్రంలో దహనం చేస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో నమోదైన 26 కేసుల్లో పట్టుబడ్డ 78 కిలోల 295 గ్రాముల గంజాయిని పోలీసులు సోమవారం దహనం చేశారు. గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌కు తరలించిన పోలీసులు అక్కడి ఎలక్ట్రిక్ యంత్రంలో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీసీఆర్బీ డీఎస్పీ సీహెచ్.నాగేందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.పాండేరావు, డీసీఆర్‌బీ ఎస్సై హకీమ్ పాల్గొన్నారు.

### ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా రాధిక



బాధ్యతలు స్వీకరిస్తున్న రాధిక

మంచిర్యాల టౌన్: ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా మంచిర్యాలకు చెందిన గైనకాలజిస్టు వైద్యురాలు రాధిక నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాకు గత మూడేళ్లుగా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ లేకపోవడంతో ఉమ్మడి జిల్లా మేనేజర్ సత్యనారాయణ అదనపు బాధ్యతలను ఇన్నాళ్లుగా నిర్వర్తించారు.

# ఆర్జీయూకేటీ బలోపేతానికి చర్యలు

- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీ బలోపేతానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. సోమవారం బాసర పరిపాలన భవనంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో ఓఎస్‌డీ మురళీదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో సెమిస్టర్ ప్రారంభమవుతున్న సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన విధులు, అకాడమిక్స్, సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ, ఇంటెర్న్‌షిప్, లైబ్రరీ బలోపేతం, పీయూసీ విద్యార్థులకు కంప్యూటర్‌ల్యాబ్ ఏర్పాటు, ఇంజినీరింగ్ విద్యార్థులకు గేట్ తరగతుల నిర్వహణ, టెక్‌ఫెస్ట్, కల్చరల్‌ఫెస్ట్,స్పోర్ట్స్ డే, తదితర కార్యక్రమాలను మార్చిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ విభాగం నుంచి బడ్జెట్ ప్రపోజల్‌ను అందించాలని సూచించారు.

# జిన్నింగ్‌మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- జైనూర్‌లో ఘటన
- వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం
- రూ.కోటికి పైగా నష్టం!



కాలిపోతున్న పత్తి కుప్పలు

జైనూర్: మండల కేంద్రంలోని సర్రాన్ జిన్నింగ్ మిల్లులో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి విక్రయించేందుకు వచ్చిన ఐచర్ వాహనంలో పత్తిని అన్‌లోడ్ చేసే క్రమంలో సైలెన్సర్ నుంచి వెలువడిన నిప్పురవ్వలు పత్తికి అంటుకుని మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలో వ్యాపించడంతో పత్తి నిల్వలు భారీగా దగ్ధమయ్యాయి. నిర్వాహకులు మంటలార్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడంతో అప్పటికే వేల క్వింటాళ్ల పత్తి అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో రూ.కోటి పైగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, నాయకులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దట్టమైన పొగ మంటలు చెలరేగడంతో ప్రజలు జిన్నింగ్ మిల్లు వద్ద భారీగా గుమిగూడారు. కాగా, ప్రమాద నష్టంపై పంచనామా నిర్వహించి వివరాలు వెల్లడిస్తామని అధికారులు, నిర్వాహకులు తెలిపారు.

**పత్తి పంటకు నిప్పు**

భీమిని: మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధి మెట్టం గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు పత్తికి నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులో రైతు గుర్ల పోశన్న తన పత్తి చేను వద్ద సుమారు 50 క్వింటాళ్ల పంట నిల్వ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం ఉదయం పత్తికి నిప్పు పెట్టారు. చుట్టుపక్కల రైతులు గమనించి బాధిత రైతుకు సమాచారం అందించారు. గ్రామస్తులు, రైతులు నీటితో మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు 5 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. తనకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు వారిని వేడుకున్నారు.



కాలిన పత్తిని చూపుతున్న బాధిత రైతు

**షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు..**

కైలాస్‌నగర్: పట్టణంలోని మహాలక్ష్మివాడకాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. యజమాని కవిత పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న బాధితురాలు కాలిపోయిన వస్తువులను చూస్తు రోధించింది. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

**టిఫిన్ సెంటర్ వాహనం..**



దగ్ధమవుతున్న వాహనం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాగులవాడకాలనీలో టిఫిన్ సెంటర్ వాహనం దగ్ధమైంది. కాలనీలో అద్దెకు ఉంటున్న నరేశ్ ఆదివారం ఇంటి ఎదుట వాహనం నిలిపి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో వాహనంలోని బ్యాటరీ నుంచి ఒక్కసారి మంటలు చెలరేగాయి. గమనించిన కాలనీవాసులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

# డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- మాలేపూర్ ఘాట్ వద్ద ప్రమాద ఘటన
- డ్రైవర్ నిర్లక్ష్యమేనని పోలీసుల నిర్ధారణ
- కేసు నమోదు, అరెస్టు
- ఇప్పటివరకు ఇద్దరి మృతి
- క్షతగాత్రులకు రిమ్స్‌లో చికిత్స

**విచారణ కొనసాగుతుంది..**



మాలేపూర్ ఘాట్ సెక్షన్ వద్ద జరిగిన ప్రమాదానికి సంబంధించి విచారణ కొనసాగుతుంది. డ్రైవర్‌ను అరెస్ట్ చేశాం. 35 మంది క్షతగాత్రులు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. – కాజల్, ఉట్నూర్ ఏఎస్పీ

సాక్షి,ఆదిలాబాద్: నార్నూర్ మండలం మాలేపూర్ శివారులో ఘాట్ సెక్షన్ వద్ద ఆదివారం ఐచర్ బోల్తాపడిన ఘటనలో విచారణ కొనసాగుతుందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ తెలిపారు. గుడిహత్నూర్ మండలం పూనగూడ తోషం గ్రామానికి చెందిన డ్రైవర్ కనక శ్రీరామ్ (26) డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాన్ని నడిపినట్టు గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారిస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్‌పై నార్నూర్‌లో కేసు నమోదు చేశారు. అరెస్టు చేశారు.

**క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స..**

గుడిహత్నూర్ మండలం సూర్యగూడ, ఇంద్రవెల్లి మండలంలోని సాలెవాడకు చెందిన ఆదివాసీలు జంగుబాయిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం ఐచర్ వాహనంలో బయల్దేరారు. కాప్లే జంగుబాయి వద్ద పుణ్యస్నానాలు, దర్శనం కోసం వెళ్లారు. ఈక్రమంలో సాయంత్రం మాలేపూర్ ఘాట్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ నిర్లక్ష్యం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

### గాయపడిన వృద్ధురాలు మృతి



తొడసం నాగుబాయి (ఫైల్)

ఇంద్రవెల్లి: నార్నూర్ మండలంలోని మాలేపూర్ ఘాట్ వద్ద ఐచర్ బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయలైన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంద్రవెల్లి మండలంలోని సాలేగూడకు చెందిన తొడసం నాగుబాయి(70) గుడిహత్నూర్ మండలం సూర్యగూడలోని బంధువులతో కలిసి జంగుబాయి దేవత ఉత్సవాలకు ఐచర్ వాహనంలో వెళ్తోంది. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజమున మృతిచెందింది. ఆమె మృతితో సాలేగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి కుమారులు సుదర్శన్, మనోహర్ ఉన్నారు.

# అనారోగ్యంతో కొడుకు చనిపోయాడని..

- గోదావరిలో దూకి తండ్రి ఆత్మహత్య
- బాసరలో ఘటన



శివరాం మృతదేహం

బాసర: అనారోగ్యంతో కొడుకు చనిపోయాడని తట్టుకోలేని తండ్రి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బాసరలో చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ కథనం ప్రకారం..నిజామాబాద్ జిల్లా జాన్కంపేట్ గ్రామానికి చెందిన శివరాం (62)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తండ్రి శివరాం దిగులుగా ఉంటున్నాడు. అనారోగ్యంతో కొడుకు మృతితో మనోవేదనకు గురయ్యాడు. సోమవారం బాసరకు చేరుకుని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పెద్దకుమారుడు సతీశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించి ఆదివాసీలతో భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో జీవో నంబర్ 3తో పాటు గిరిజన సంక్షేమ శాఖ జీవో నంబర్ 29లతో కలిపి ఆదివాసీలకు వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఎల్టీఆర్ 1/59, 1/70, ఆర్వోఎఫ్ఆర్, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోడు రైతులకు పట్టాలివ్వాలన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

### కోడిపందేల స్థావరంపై దాడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొన్నారం సమీపంలో ముందస్తు సమాచారంతో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం కోడిపందేల స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో మూడు పందెం కోళ్లు, మూడు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, 9 బైక్‌లతోపాటు రూ.2630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# మేకలను కట్టేయవద్దన్నందుకు గొడ్డలితో దాడి



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

రెబ్బెన: దారిలో మేకలను కట్టేయవద్దన్నందుకు ఒకరిపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. మండలంలోని కొండపల్లిలో ఈ ఘటన చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సునార్కర్ శంకర్ ఇంటి వెనకాల చునార్కర్ తుకారాం ఇల్లు ఉంది. శంకర్ ఇంటి పక్కనుంచి దారిలో వెళ్లాలి. గత కొంతకాలంగా ఆ దారిలో తుకారాం..మేకలను కట్టేస్తున్నాడు. గత 20 రోజుల క్రితం శంకర్ తన ఇంటికి కొత్త రంగులు వేశాడు. అక్కడ మేకలు కట్టేయడంతో గోడలపై బురదపడుతుంది. ఈ విషయమై ఆదివారం సాయంత్రం మేకలు ఇంటికి వచ్చే సమయంలో వాటిని ఇంట్లో కట్టేసుకోవాలని శంకర్ కోరగా, తుకారం ఆగ్రహించాడు. దుర్భాషలాడుతూ గొడ్డలితో శంకర్‌పై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన అతన్ని కుటుంబీకులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య కమల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి సోమవారం విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలానికి వెళ్లి దాడికి గల కారణాలను ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు.

# శ్రమదోపిడీని ఉపసంహరించుకోవాలి

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



సత్తయ్యకు మెమోరాండం సమర్పిస్తున్న కార్మికులు

నస్పూర్: సింగరేణి కార్మికుల వేతన శ్రమదోపిడీని యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీరాంపూర్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గనుల్లో జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీకి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. దీనిప్రకారం కార్మికులకు వేజ్ ప్రొటెక్షన్ కల్పించాల్సిన యాజమాన్యం కార్మికుల మూల వేతనం నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు మినహాయించుకుని వారిని ఆర్థిక దోపిడీకి గురిచేస్తోందన్నారు. అనంతరం పలువురు కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సత్తయ్యకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి రాజేందర్, శ్రీకాంత్, శంకర్, కిశోర్, రవీందర్, సత్యనారాయణ, రామస్వామి, రాజయ్య, శ్రీనివాస్, వేణు, తిరుపతి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.